క్లుప్తంగా

తపస్ డైరీ ఆవిష్కరణ

వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, వనపర్తి జిల్లా శాఖ నూతన సంవత్సర డైరీని బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సీజీ విష్ణువర్ధన్, జిల్లా మీడియా కన్వీనర్ విష్ణువర్ధన్, పెబ్బేరు మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నవగ్రహ విగ్రహాల ధ్వంసం



చిన్నంబావి: బెక్కెం గ్రామంలోని శివాలయంలో నవగ్రహ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన స్థానికులు బుధవారం ఉదయం గుడికి వెళ్లగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో వెంటనే స్పందించిన స్థానికులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా.. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో గుడి ఆవరణను పరిశీలించారు. ఘటనపై కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. వేలి ముద్రలు సేకరించామని, విచారణ చేసి త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.

విధుల్లోకి సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు

పాన్‌గల్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె విరమణ నేపథ్యంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం విధుల్లో చేరారు. విధుల్లో చేరిన ఉద్యోగులతో ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ శ్రీనివాసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సుమారు నెల రోజుల పాటు సమ్మెలో ఉండి విధుల్లో చేరిన ఉద్యోగులు ఇక నుంచి రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తూ సమ్మె కాలంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వేగంగా పూర్తి చేయాలని ఎంఈఓ సూచించారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటును బుధవారం వనపర్తిలోని ప్రజావైద్యశాలకు చెందిన డాక్టర్లు శారద, మురళీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమాకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల మేలు కోసం డాక్టర్లు శారద, మురళీధర్ తమ సొంత నిధులతో పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే బాలికల పాఠశాలలో సైతం మరో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు దాతలు ఒప్పుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మధుకర్‌స్వామి, ప్రకాశ్, ఎస్సీ సెల్ సభ్యుడు నాగరాజు, సత్తార్, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న లారీ

కొత్తకోట రూరల్: ఆగి ఉన్న డీసీఎంను లారీ ఢీకొట్టిన ఘటన కొత్తకోట సమీపంలో జాతీయ రహదారి 44పై బుధవారం చోటు చేసుకుంది. కర్నూల్ నుంచి కూల్‌డ్రింక్ ఖాళీ సీసాల లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం కొత్తకోట సమీపంలోకి రాగానే డ్రైవర్ మూత్ర విసర్జన కోసం వాహనాన్ని రోడ్డు పక్కకు ఆపాడు. కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ముందు ఆగి ఉన్న డీసీఎంను చూసుకోకుండా వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో డీసీఎం రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో ఖాళీ సీసాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. డీసీఎం డ్రైవర్ వాహనంలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

వనపర్తి రూరల్: అటవీ భూములను ఆక్రమించే వారిపై అటవీ చట్టాల ప్రకారం భారీ జరిమానాలు, జైలు శిక్షలు విధిస్తామని వనపర్తి అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ నిఖిల్‌రెడ్డి హెచ్చరించారు. వనపర్తి మండలంలోని కాశీంనగర్ సెక్షన్‌లోని గోప్లాపూర్ బీట్ అటవీ ప్రాంతంలో అటవీ సరిహద్దు అయినా సీపీటీని ఈ నెల 4న తొలగించి భూ అక్రమణకు పాల్పడిన కాశీంనగర్ గ్రామానికి చెందిన ఎర్రన్నపై కేసు నమోదు చేయడంతో పాటు జేసీబీని సీజ్ చేసి వనపర్తి కోర్టులో హాజరుపర్చామని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కొత్తకోట: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా నియమితులైన ఆంగ్ల ఉపాధ్యాయులను కొత్తకోట ఎమ్మార్సీ భవనంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, ఎల్టా జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, కోశాధికారి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

లెక్క పక్కాగా ఉండాలి

- మున్సిపాలిటీల బడ్జెట్ కూర్పుపై కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచనలు
- కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మున్సిపల్ అధికారులు



ఏదుట్లలో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి: 2025–26 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ బడ్జెట్ పక్కాగా రూపొందించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి జిల్లాలోని అన్ని మున్సిపల్ అధికారులు, అకౌంట్స్ ఆఫీసర్లతో బడ్జెట్ ప్రతిపాదనల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలు, వసూలు చేసిన పన్నులు, ఖర్చులపై ఒక్కో మున్సిపాలిటీ వారీగా తెలుసుకున్నారు. మున్సిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్, గృహాల నుంచి పన్నులను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కొత్త బడ్జెట్‌లో పారిశుద్ధ్యం, ఇంటింటికీ తాగునీటి సరఫరా, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పన, వాహనాలు కొనుగోళ్లు, విద్యుత్ బిల్లులు చెల్లించడం వంటిపై దృష్టి సారించాలని సూచించారు. వచ్చిన ఆదాయంలో 10శాతం గ్రీన్ బడ్జెట్‌కు కేటాయించి మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. వీధి కుక్కల నియంత్రణకు శస్త్ర చికిత్సలు చేయించే విధంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, అందుకు నిధులు కేటాయించాలని సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గోపాల్‌పేట: గురువారం ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పర్యటన నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఏదుట్లలో నిర్మించిన సబ్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. మొదట రేవల్లి మండలంలోని తల్పునూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తారని, అనంతరం గోపాల్‌పేట మండలంలోని ఏదుట్లలో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. ఆ తర్వాత జిల్లా కేంద్రంలోని వివిధ కార్యక్రమంలో హాజరవుతారని తెలిపారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని సూచించారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు



డిప్యూటీ సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

అన్ని జిల్లాల్లో స్వయం సహాయక బృందాల ద్వారా సోలార్ ప్లాంట్ల ఏర్పాటు అంశంపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మంత్రి కొండా సురేఖతో కలిసి కలెక్టర్లతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ స్వయం సహాయక బృందాల ద్వారా సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం వనపర్తి జిల్లాలో ఇప్పటికే 15 ఎకరాల స్థలాన్ని గుర్తించామని బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్‌డీఓ ఉమాదేవి, డీఎల్‌పీఓ రఘునాథ్, అటవీ అధికారి నిఖిల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల సామర్థ్యం పెంచాలి



ఆత్మకూర్: ఆత్మకూర్, మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యం పెంచడంతో పాటు అమరచింతలో ఏరియా ఆస్పత్రిని స్థాపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్లు, ఇతర కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మక్తల్‌లో 150 పడకలు, ఆత్మకూర్‌లో 100 పడకలు, అమరచింతలో ఏరియా ఆస్పత్రులను ఏర్పాటు చేసి పేదలందరికీ ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సంక్రాంతి పండుగకు ముందే పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, ముఖ్యమంత్రి, వైద్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారని వారు తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన

పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలు పెరిగేలా బోధన సాగాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పక రావాలన్నారు. 2వ తరగతి విద్యార్థుల గణిత సామర్థ్యాలు, 4వ, 7వ తరగతి విద్యార్థుల తెలుగు రీడింగ్ స్కిల్స్‌ను పరిశీలించగా.. వారు మంచి ప్రతిభను చూపడంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయుల బృందాన్ని ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కురుమూర్తి నాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ధర్నా



పాన్‌గల్‌లో సీహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కొత్తకోట: ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్ ఆసియాను కలిసి ఆశాల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. అనంతరం నిక్సన్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల వేతనం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగ్యమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రమీల, నందకిషోర్, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు మంజుల, పుష్ప, అర్చన, చంద్రకళ, కాంచన, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ఆశా కార్యకర్తల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 10వ తేదీన ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని యూనియన్ మండల నాయకురాలు సుజాత, మహేశ్వరి, గోవిందమ్మ, లక్ష్మి, ఆశమ్మ, పారిజాతమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్యకు యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాకు అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న జిల్లా కేంద్రాల్లోని కలెక్టర్ కార్యాలయం వరకు 10 కి.మీ. పాదయాత్ర నిర్వహిస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి 10 రోజుల ముందు నుంచి రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామన్నారు.

‘ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం’



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలతో కలిసి నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎండీ జబ్బార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వెంకటయ్య అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రూ.రెండు లక్షల పంట రుణమాఫీ చాలామంది రైతులకు కాలేదని.. వారికి ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని తెలిపారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్లు ఇవ్వాలని, మండలంలోని కేతేపల్లి, వెంగళాయిపల్లి, పాన్‌గల్‌లో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా పనిచేయాలన్నారు. మండలంలోని రేమద్దులలో సింగిల్‌విండో ఏర్పాటుకు పార్టీ తరఫున పోరాడుతామని, మంత్రి జూపల్లి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని, జిల్లా కో–ఆపరేటివ్ అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్, భగత్, జంబులయ్య, వెంకటయ్య, రాము, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

ఆత్మకూర్: స్వామినాథన్ సిఫార్సులకు మేరకు రైతులు పండించిన పంట పెట్టుబడికి 50 శాతం కలిపి నిర్ణయిస్తామని 2014లో హామీనిచ్చిన బీజేపీ ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదని వామపక్షాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదట అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజన్న, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా కోశాధికారి రాజు, ఏఐయూకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా రైతుల నడ్డి విరిచేందుకు మూడు కార్పొరేట్ వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారని దుయ్యబట్టారు. 13 నెలల పాటు రైతుల ఉద్యమాలు చేపడితే పోలీసులతో లాఠీచార్జ్ చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేయాలని, రెండు పంటలకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు చితలన్న, మణివర్ధన్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు

పెబ్బేరు రూరల్: చరిత్రలోనే కాంగ్రెస్ పార్టీ రైతులకు చేసినంత ఎక్కువ మొత్తంలో రుణమాఫీ మరే ఇతర రాష్ట్రాల్లో జరగలేదని, ఆ ఘనత పాలమూరు ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముందుగా మండల కేంద్రంలోని చౌరస్తాలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతులను మోసం చేసిందని, రైతుల ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని రూ.7 లక్షల కోట్ల అప్పులతో ప్రజలపై భారం పెట్టిందని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా 6 గ్యారంటీ పథకాలు అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రమోదిన్‌రెడ్డి, విజయవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటరాములు, రంజిత్, హరికుమార్, నరేందర్, సురేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం వెలికితీయాలి

అమరచింత: విద్యార్థుల్లో నైపుణ్యం వెలికి తీసి భావి భారత సైంటిస్టులుగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ఉపాధ్యాయులకు సూచించారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పారిశ్రామికవేత్త మధులాష్‌బాబు ఆధ్వర్యంలో చేపడుతున్న కలాం స్ఫూర్తి యాత్ర బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కలాం స్ఫూర్తి యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక, సాంకేతికతను నేరుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వద్దకే వచ్చి ప్రేరణ కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యాత్ర నిర్వాహకులు శ్రీజ, అర్చన, అజయ్‌రెడ్డి, దిలీప్‌కుమార్, సాయిసుబ్రమణ్యం, రోహిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఉప ముఖ్యమంత్రి పర్యటన

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ కోరారు. పెబ్బేరు పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో వనపర్తి అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో వెంకట్రాములుయాదవ్, వేముల శ్రీనివాస్‌రెడ్డి, హరికుమార్‌రెడ్డి, రాంపూర్ సహదేవుడు, నరేందర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ సాధారణ సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, అంజన్న, గాయత్రి, అంజి, రాము తదితరులు ఉన్నారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

ఖిల్లాఘనపురం: ప్రేమ పేరుతో ఓ యువకుడు వేధిస్తున్నాడని మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖిల్లాఘనపురంలో మంగళవారం చోటు చేసుకోగా బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన చెర్క గోపమ్మ కుమార్తె చెర్క రేవతి (22)ని కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన గాండ్ల భానుప్రకాష్ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ విషయమై పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి మాట్లాడారు. అయినప్పటికీ యువకుడు ప్రవర్తన మార్చుకోలేదు. మంగళవారం భానుప్రకాష్ తన ఇన్‌స్టాగామ్ ఖాతాలో మరో యువతితో దిగిన ఫొటోలను పోస్టు చేశాడు. వాటిని చూసిన యువతి తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి గోపమ్మ, తన కుమార్తె చావుకు భానుప్రకాష్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులు అంజనేయులు, నాగరాజు, ప్రవీణ్, అంజలమ్మ కారణమని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

గోపాల్‌పేట: వివాహిత అదృశ్యమైందని బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఏదుట్లకు చెందిన మిడత రాములు భార్య మిడుత మణెమ్మ ఈ నెల 4న కల్లు తాగి ఇంట్లో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతుండడంతో.. ఆమెను ఇంట్లో ఉంచి రాములు బయటికి వెళ్లి తిరిగి వచ్చి చూడగా ఇంటి వద్ద కనిపించలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం మణెమ్మ భర్త రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వనపర్తిలో రక్తదాన శిబిరం ఏర్పాటు

- ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదిన వేడుకలు
- ఒకే రోజు 559 యూనిట్ల రక్తం సేకరణ



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదానం చేస్తున్న అభిమానులతో ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి: స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 559 యూనిట్ల రక్తం సేకరించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

గట్టుకాడిపల్లి ఆలయంలో పూజలు

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, శారద దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని ఆలయం వద్ద నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో సాయిచరణ్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, క్యామ రాజు, వెంకటేశ్వర్‌రావు, ఆగారం ప్రకాష్, విజయ్ కుమార్, బాలకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల శివారులోని చేయూత ఆశ్రమంలో బుధవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పుట్టిన రోజు వేడుకలను విద్యార్థుల సమక్షంలో ఆయన సతీమణి శారద కేక్ కట్ చేసి విద్యార్థులకు కేక్ తినిపించారు.

గోపాల్‌పేట: ఉమ్మడి మండలంలో కాంగ్రెస్ కార్యకర్తలు కేక్ కట్ చేసి ఎమ్మెల్యే మేఘారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ఎస్సీ హాస్టల్లో పిల్లలకు ప్రభుత్వం పంపిన దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివన్న, వెంకటేష్ పాల్గొన్నారు. రేవల్లి మండలంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్వతాలు సమక్షంలో కస్తూర్బాగాంధీ పాఠశాలలో మేఘారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

రైతులను అవమానపర్చడం తగదు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆత్మకూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగుతుందని, అన్నం పెట్టే రైతులను అవమానపరుస్తున్నారని మాజీ ఎంపీపీలు శ్రీధర్‌గౌడ్, బంగారు శ్రీను, విరేశలింగం అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్నికల్లో ఎకరాకు రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ రూ. 12 వేలకు కుదించడం నీచమైన చర్యగా అభివర్ణించారు. రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో రైతుల పక్షాన ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, మాజీ వైస్‌ఎంపీపీ కోటేష్, కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌అలీ, బీఆర్‌ఎస్ నాయకులు హాశీం, శేఖర్, రాజ్‌కిరణ్, లక్ష్మణ్, మాసన్న, రవి, జహంగీర్, కురుమూర్తి, విష్ణురెడ్డి, దందు శ్రీను, దావీదు, శివ, లక్షణ్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని నిరసిస్తూ బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆత్మకూర్‌లో నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ చాంద్‌పాషకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ, రాజశేఖర్‌గౌడ్, ప్రభాకర్, శ్రీశైలం, బచ్చు రాము, పెద్దిరాజు, తిరుమలేష్, ఎద్దుల రాజు, శ్రీకాంత్, వెంకటేష్, శివ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనోహర్‌గౌడ్, బాలకృష్ణ, భీంరెడ్డి, సమద్, హరికృష్ణ, లక్ష్మీకాంత్, ఉదయ్, బాలరాజు, నీలారెడ్డి తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం



ఖిల్లాఘనపురం తెలంగాణ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

ఖిల్లాఘనపురం: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సురేష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని దొంతికుంటతండా స్టేజీ వద్ద ఉన్న తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ వినియోగం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు ఎలాంటి పనులు చేయకుండా ప్రజలను మోసగించి సులువుగా డబ్బులు సంపాదించేందుకు సైబర్ నేరాలకు అలవాటు పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఖిల్లాఘనపురంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలో సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు ఎస్‌ఐ రాణి అవగాహన కల్పించారు. యువత పెడదారిని పట్టకుండా వారి తల్లిదండ్రులు నిరంతరం నిఘా వేసి ఉంచాలని, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు అశోక్, సురేష్, కాశీం పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తకోట ఎస్‌ఐ ఆనంద్ సూచించారు. ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశానుసారం బుధవారం మండలంలోని కనిమెట్టలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఏదైనా ఫేక్ వెబ్‌సైట్ లింక్, ఏపీకే ఫైల్, ఎఫ్‌ఐఆర్, డిజిటల్ రిమాండ్, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్ వంటి లింకులు వస్తే, వాటిని ఉపయోగించొద్దని సూచించారు.